# ఆదర్శం

కేవలం ఉపాదానం మీదనే పొట్టపోసుకుంటున్న శాస్త్రిగారికి మరే విధమయిన ఇతర ఆదాయమూ లేదు.

తండ్రి, తాతగారు పౌరోహిత్యం చేసి ఆ రోజులలో బాగా బ్రతికేరు. వారసత్వం తాలూకు సంక్రమించిన ఆస్తి కేవలం ఒక మట్టి మిద్దె మాత్రమే, అదీ సగం కూలిపోయింది. అందులోనే తల దాచుకోవలసి వచ్చింది శాస్త్రిగారు.

ఒక్కగానొక్క మగపిల్లవాడికి చదువు చెప్పించారు అష్టకష్టాలు పడి. పెళ్ళి కూడా చేశారు. అయితే ఉద్యోగం వచ్చాక రెక్కలొచ్చినపక్షిలా ఎగిరిపోయిన కొడుకు, శాస్త్రిగారి సంగతే పూర్తిగామర్చిపోయాడు. స్వార్థం పెరిగిన కొడుకు, తనకెందుకూ కొరగాకుండా పోయినందుకు... ఏ విధంగానూ తనను ఆదుకోనందుకు, దిగులుతో మనిషి కృంగిపోతున్నాడు.

పెళ్ళికెదిగిన ఆడపిల్ల, శాస్త్రిగారికి గుండెలమీద కుంపటిగా తయారవటం మరో దురదృష్టం.

కృష్ణవేణికి రజస్వల కాకముందే పెళ్ళి చేసేసి కన్యాదాన ఫలం దక్కించుకోవాలని ఎంతో తాపత్రయపడ్డారు శాస్త్రిగారు. కాని... కాలం కలసి రాకపోవటంతో, కూతురు పెళ్ళి వాయిదాలు పడుతూ వచ్చింది. ఇందుకు కారణం శాస్త్రిగారి దుర్భర దారిద్ర్యం.

ఉపాదానంమీద రెండు పొట్టలు గడవటమే కష్టంగా వుంటే... కూతురు పెళ్ళికూడా ఎలా చెయ్యగలడు?

ఎన్ని సంబంధాలొచ్చినా,... ఎందరొచ్చి పిల్లను చూచి వెళ్ళినా, తీరా కట్నం కానుకల విషయం వచ్చేసరికి వ్యవహారం బెడిసికొడుతోంది.

తాను రాలిపోయేలోగా కృష్ణవేణిని ఓ అయ్య చేతిలో పెట్టాలన్నదే శాస్త్రిగారి చివరి కోరిక. ఆ కోరిక తీరేమార్గమే కన్పించటం లేదు.

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. ఎర్రని ఎండలో వీథుల గుండానడుచుకుంటూ శాస్త్రిగారు ఇల్లు చేరుకుందామనే ఆరాటంతో గబగబా పోతున్నాడు.

ఓ సందు మలుపులో ప్రెసిడెంటుగారు ఎదురయి శాస్త్రిగారిని పలుకరించి కుశలమడిగాడు.

ఆమాట ఈమాట మాట్లాడి "చూడండి శాస్త్రిగారూ! మన గ్రామంలో పెళ్ళికావలసిన ఆడపిల్లలు చాలామంది వున్నారు. మీమాట అలా వుంచి... మిగతావారి గౌరవ మర్యాదల విషయమయినా ఆలోచించాల్సిన అవసరం మీకువుంది... ఏమంటారు?" అంటూ అసలు విషయానికొచ్చాడు ప్రెసెడెంటు.

మాటలలోని భావాన్నీ... వాటివెనుక దాగిన గూడార్థాన్నీ గ్రహించలేకపోయిన శాస్త్రిగారు వెర్రిముఖం వేసుకుని నిల్చుండిపోయారు.

"అదేనండీ!... మీ అమ్మాయి కృష్ణవేణి... స్కూలు టీచరు దాసప్పతో చనువుగా ప్రవర్తించటం ఏమీ బాగోలేదు. రెండు మూడుసార్లు నా కళ్ళతో నేను చూశాను. పెళ్ళికాని పిల్లగదా... వ్యవహారం శృతిమించుతుందేమోనని హెచ్చరిస్తున్నాను..." అన్నాడు ప్రెసిడెంటు.

ఆ మాట విన్న శాస్త్రిగారు అవాక్కయ్యాడు. మనిషి నిలువు గుడ్లు వేసుకుని నిల్చుండిపోయాడు.

"కాస్త కూతుర్ని అదుపులో పెట్టండి! లేకపోతే...గుట్టు రట్టవుతుంది. ఓనాటికి ఊరంతా కోడయి కూస్తుంది... ఆతర్వాత మీ ఇష్టం..." అనేసి హెచ్చరించి ముందుకు సాగిపోయాడు ప్రెసిడెంటు.

తన చెవులను తానే నమ్మలేకపోతున్నాడు శాస్త్రిగారు. తన కూతురు నిప్పులాంటిది అనుకుంటూ తడబడే అడుగులతో ఇల్లు చేరుకున్నాడు.

పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాలలో టీచరు ఉద్యోగం చేస్తున్న దాసప్పకు ముప్పయ్యి ఏళ్ళు వుంటాయి.

చిన్ననాటినుండి కులవృత్తి మీదే బ్రతుకుతున్న యాదయ్యకు, ఒక్కగానొక్క కొడుకు దాసప్ప.

దాసప్ప మనిషి నలుపన్నమాటేగాని... ఎప్పుడూ తెల్లటి దుస్తులలో మెరిసిపోతుంటాడు. అతగానితో పరిచయం వున్న ఎవరికయినా... సభ్యతాసంస్కారాలు అతడి సొత్తు అని అనిపించకతప్పదు.

ప్రహరీగోడ లేని ప్రాథమిక పాఠశాల భవనానికి దగ్గరలోవున్న పెద్ద చింతచెట్టు నీడలో వలయాకారంగా పిల్లల్ని కూర్చోబెట్టుకుని వారిమధ్య నిలబడి పాఠం చెపుతున్నాడు దాసప్ప.

ఆ పిల్లలకు దాసప్ప కేవలం ఉపాధ్యాయుడేకాదు... అంతకు మించిన ఆత్మీయుడు. అతనంటేపిల్లలందరికీ ప్రాణం. పాఠాలు మాత్రమేచెప్పటం కాకుండా పసివాడిలా వాళ్ళతో కలసి ఆడుకుంటాడు. నవ్వుతూ పిల్లల్ని నవ్విస్తాడు. మంచి కథలు చెప్తాడు. తనపై వారికి మమతానురాగాలు కలిగేలా చేస్తాడు. అదీ అతనిలో వున్న గొప్పతనం.

చింతచెట్టు ప్రక్కగా సన్నని కాలిబాటవుంది. ఆ బాటవెంట ఆ గ్రామంలో స్త్రీలు చెరువు నీటికోసం బిందెలు పట్టుకుని వెడుతుంటారు.

ఆరోజు... వేళగాని వేళలో బిందె చంకన పెట్టుకుని కృష్ణవేణి ఆ దారి వెంట నడిచి వెడుతోంది.

ఆ సమయంలో కృష్ణవేణి నడకలో చురుకుదనంగాని ముఖంలో ఎప్పటిలా సంతోషం గాని అవుపించలేదు దాసప్పకు. వెంటనడుస్తూ ''అలా దిగులుగా వున్నావేం కృష్ణవేణీ?...'' అడిగాడు .

కృష్ణవేణి కళ్ళు చెమర్చాయి. జీరబోయిన కంఠంతో ''మన స్నేహం సంగతి నాన్నకు తెలిసిపోయింది'' అన్నది.

''ఓస్ అంతేకదా! ఈ మాత్రానికే మనసు కష్టపెట్టుకోవటం దేనికి? ఇంకా ఏమయినా అన్నారా మీ నాన్న?'' చొరవగా ప్రశ్నించాడు దాసప్ప.

''నోటికొచ్చినట్టల్లా తిట్టాడు, ఎప్పుడూ లేనిది నామీద చెయ్యికూడా చేసుకున్నాడు. ఇల్లు విడిచి బయటకు వెళ్ళేందుకు వీలులేదని శాసించాడు. ఈ విషయాలన్నీ చెప్పాలనే యిలా వచ్చాను.'' బేలగా అంది కృష్ణవేణి.

''మరి నువ్వేమన్నావ్ ?''ఆసక్తిగా అడిగాడు దాసప్ప.

'నేనేం మాట్లాడలేదు. ఏం చెప్పటానికీ ధైర్యం చాలలేదు...''

''నువ్వు ఆడదానివి కదా, ఏంమాట్లడతావులే? చూడూ! జరిగినదానికి బాధపడకు, జరగవలసింది ఆలోచించు.'' ధైర్యం చెప్పాడు దాసప్ప.

'చెరువులో దూకి హాయిగా చచ్చిపోవాలని వుంది' అంటున్న కృష్ణవేణిలో దుఃఖం పెల్లుబికింది.

''అదే పిరికితనం! కాదు-పిచ్చితనం! నువ్వు చనిపోతే సమస్య పరిష్కారమవుతుందా? ఇన్నాళ్ళు మనిద్దరి మధ్య వున్నది కేవలం పవిత్రమయిన స్నేహం మాత్రమే. కానీ ఇప్పుడు నాకు అనిపిస్తోంది-మనం ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు అని...''

అ మాట విన్న కృష్ణవేణి నిశ్చేష్టురాలయింది

''ఏం? నా నిర్ణయం నీకు నచ్చలేదా?''

''కాదు, మా నాన్న వప్పుకోవద్దూ?...'' బేలగా అంది.

''మీ నాన్నగారి మాట అలావుంచి ముందు నీ అభిప్రాయం చెప్పు. ఈ కులాలు, మతాలు మనుష్యులు వారి స్వార్థం కొరకై ఏర్పరచుకున్న కట్టుబాట్లు. నేను హరిజనుడనే కావచ్చు కానీ. నీముడ్ని మాత్రం కాదు. నేను మనసున్న మనిషిని! నాకు హృదయముంది. నా వంట్లో ప్రవహించేదీ నెత్తురే! అంచేత ఇప్పుడు కావలసిందల్లా నీ అభిప్రాయమే! చూడూ, నిన్ను పెళ్లాడటం నా పూర్వజన్మసుకృతం అనుకుంటాను. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. మన వివాహం ఆదర్శ వివాహమై ఈ వ్యవస్థలో జీర్ణించుకు పోయిన సాంప్రదాయాల సంకెళ్ళను తునాతునకలు చెయ్యగలగాలి! ఏమంటావు కృష్ణవేణీ?''

''నీ మాటలు వింటుంటే ఎనలేని ధైర్యం, మా నాన్న బెదిరింపులు చూస్తుంటే భరించలేని పిరికితనం... రెండూ కలిసి నన్ను గందరగోళం పెడుతున్నాయి...'' చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంటూ మాట్లాడింది కృష్ణవేణి.

''నువ్వేం అధైర్యపడకు. ఈ సమస్యను ధైర్యంతో... సాహసంతో నేను పరిష్కరిస్తాను...'' అని వూరడింపు మాటలు చెప్పి, కృష్ణవేణిని ఇంటికి సాగనంపేడు దాసప్ప.

దాసప్ప మనస్సులో ఎన్నెన్నో ఆలోచన్లు. మరెన్నో ప్రశ్నలు. తానేమీ సంఘసంస్కర్తకాడు. అయినా సాటిమనిషికి సాయపడాలనే ఆరాటంలో చేస్తున్న తెగింపు మాత్రమే.

తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వుండగల పట్టుదల మనిషి దాసప్ప! మనిషిలో ఆత్మస్థయిర్యం, తెగింపు కావలసినంత వుంది.

ఇల్లు చేరుకున్న దాసప్పను చూస్తూ ''ఏరా అబ్బోడా... ఇస్కూలు వదిలిపెట్టి సానాసేపైంది గదా... ఇప్పుడంట్రా ఇంటి కొచ్చేది...?'' ప్రశ్నించాడు తండ్రి యాదయ్య. నేరుగా వచ్చి వాకిట్లో వున్న మంచంమీద కూర్చుండిపోయాడు దాసప్ప.

కొడుకు మౌనం చూచి ''కూకుంటావేందిరా అబ్బోడా?... లెగు! నీకు ఆకలిగా లేధా?! నీతో కలిసి కూడు తిందాంగదాని నేనెదురు సూత్తావుండా... యాళ మించిపోయింది. కానియ్యి...'' అంటూ తొందర పెట్టేడు యాదయ్య.

'నే తర్వాత తింటాలే! అంత ఆకలిగా వుంటే నువ్వు భోజనం చేసెయ్... అంటూ మంచంమీద వాలిపోయాడు దాసప్ప.

''అదేంట్రా?... నిన్నొదిలేసి నేనెప్పుడైనా బువ్వ తిన్నానా?- అయినా ఇయ్యాలేంది అదో మాదిరిగా వుండావ్?...'' కొడుకు వాలకం అర్థంకాక అడిగేడు యాదయ్య.

తన మనసులో మాట తండ్రితో ఎలా చెప్పాలాని అలోచిస్తున్నాడు దాసప్ప.

''ఏంట్రా ఇసయం? నాతో సెప్పటానికేం? అంత సెప్పకూడని రగస్యమా?...'' తనూ మంచం మీద కూర్చుంటూ అడిగాడు యాదయ్య.

తన నిర్ణయాన్ని ధైర్యంగా తండ్రితో చెప్పేటందుకే నిర్ణయించుకున్నాడు దాసప్ప.

పడుకున్నవాడల్లా లేచి కూర్చుని తండ్రి ముఖంలోకి సూటిగా చూస్తూ 'నేను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను....'' అసలు విషయం చెప్పేడు దాసప్ప తండ్రితో.

''మా నాయనే!.... ఎన్నాళ్ళకు నీ నోటినుండి పెళ్ళిమాట ఇన్నాన్రా!.... ఇంకేం.... నే కాదనేదేముంది? అయితే.... పిల్లెవరో కూడా నువ్వే నిర్ణయించేసుకున్నావా? పిల్లెవరో సెప్పేయ్... లగ్గం పెట్టించేత్తాను....'' సంబరపడుతూ అడిగేడు యాదయ్య.

ఓసారి శూన్యంలోకి చూచి ''నాన్నా!.... పాపం.... కృష్ణవేణి లేదూ?.... అదే! మన శాస్త్రిగారి కూతురు.... ఆ అమ్మాయినే నేను చేసుకుందామనుకుంటున్నాను....'' బరువుగా చెప్పేడు దాసప్ప.

ఆ మాట విన్న యాదయ్య నివ్వెరపోయాడు. తన చెవులను తానే నమ్మలేక పోయాడు. అంతలోనే తననుతాను సంబాళించుకుంటూ ''అబ్బోడా!.... శాత్తుర్ల గారి పిల్లనేంది... నువ్వు మనువాడటమేంది?.... అలాంటి పిల్ల ఆలోశన్లు సెయ్యమాక.... కళ్లు పోతయ్! మన కులం ఏంటి? వాళ్ళ కులమేంటి? సెప్పులుకుట్టుకు బతికేవోడ్ని నేను!.... తెల్లగుడ్డలేసుకుని నువ్వు ఎంత వుద్దాగం సేత్తున్నా.... నువ్వు నా బిడ్డవి! నీ ఆలోశన సరైందికాదు అబ్బోడా!.... ఈ మాట ఎవరైనా వింటే... మనల్ని ఈ వూళ్ళో వుండనియ్యరు''అనేసి తనలో వున్న ఆందోళనను వ్యక్తం చేశాడు యాదయ్య.

''నువ్వొట్టి పాతకాలం మనిషివేకాదు, పిరికివాడివి కూడా! మనం తక్కువ కులంవాళ్ళమయినంతమాత్రాన-మన శరీరంలో ప్రవహించేది నెత్తురు కాదా! మనం మనుష్యులంకామా?... నా ఆలోచన నువ్వు కాదనకు! రోజులు మారుతున్నయ్-'' ఆవేశంగా మాట్లాడేడు దాసప్ప.

''ఒరే! నాయకులమల్లే వుపన్యాసాలు సెప్పొద్దురా! నేలవిడిచి సాముసెయ్యటం మంచిదికాదురా! నువ్వా పిల్లను మనువాడి ఆళ్ళ మర్యాద మట్టిపాలు సెయ్యొద్దురా అబ్బోడ!... నా మాట విను!... మనసు మార్చుకో...'' నచ్చచెప్ప ప్రయత్నించాడు యాదయ్య.

''నాన్నా! ఎవరి సంగతో మనకెందుకు? ముందు నీ అభిప్రాయం చెప్పు? నీకేమిటి అభ్యంతరం?'' నిలదీసి ప్రశ్నించాడు తండ్రిని దాసప్ప.

''సూడు!... నువ్వు సదువుకున్నోడివి. వుద్దోగం సేసుకుంటున్నోడివి... నీకు సెప్పగల తెలివి నాకు లేదురా!... అయినా... నీ అయ్యగా - ఓ పెద్దోడిగా... నీ ఆలోశన సెడ్డదిరాని సెప్తున్నాను. అంతే! ఈ పని సెయ్యటానికి నీ మనసొప్పినా - నాకు మాత్రం బాదగానే వుంటది.''అయిష్టంగానే తన అభిప్రాయాన్ని చెప్పేడు యాదయ్య.

''నాన్నా! ఒక్క విషయం చెప్పనా? నా నిర్ణయాన్ని హర్షించలేనివాళ్ళు కొన్నాళ్ళపాటు మనల్ని వాళ్ళ శత్రువులుగానే చూస్తారు. అందుకని-పిరికివాళ్ళలా మన నిర్ణయాన్నీ-మనసునీ మార్చుకోవటం అవివేకం. కాలమే మనుష్యుల్లో మార్పు తెస్తుంది. నువ్వు మాత్రం నా నిర్ణయాన్ని కాదనకు.''ఆవేశంగా మాట్లాడేడు దాసప్ప.

''అది సరేరా-ఇంకూ ఆ పిల్లకు నువ్వంటే ఇష్టమేనా?''

''ఇద్దరికీ అంగీకారం అయింది కనుకనే నీతో యింత గట్టిగా మాట్లాడుతోంది! నువ్వు వప్పుకో నాన్నా!''

''నీ ఇట్టంరా అబ్బోడా! మద్దిన నాదేముంది?-ఊరు పొమ్మంటా వుంది-కాడు రమ్మంటా వుంది-రేపోమాపో గుటుక్కుమంటాను నేను. పదికాలాలపాటు పచ్చగా బతకాల్సింది నువ్వు'' అనేసి తనుచెప్పదెల్చుకున్న నాలుగు మాటలూ చెప్పేడు యాదయ్య.

తండ్రి తనతో సహకరించినందుకు పొంగిపోయాడు దాసప్ప. తండ్రిని మనసులోనే అభినందించాడు.

భోజన కార్యక్రమం ముగించుకుని వీధిలోకొచ్చాడు దాసప్ప.

నేరుగా మహీధరంగారిల్లు చేరుకున్నాడు.

ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్ర సమరయోధుడు అయిన మహీధరంగారు దాసప్పను చూస్తూనే సాదరంగా ఆహ్వానించి కుశల మడిగేరు.

దాసప్ప చెప్పినదంగా శ్రద్ధగా విన్నారు.

''చూడు బాబూ! నీ ఆదర్శాన్ని మనసారా అభినందిస్తున్నాను. ఈ మనుష్యుల ఆలోచనా సరళిలో మార్పు రావటానికి మరికొన్నేళ్ళు పడుతుంది. అప్పటివరకూ నీలాంటి యువత సమస్యలను, చిక్కులను ధైర్యంతో, సాహసంతో ఎదుర్కోవాలి. అయితే నా చిన్ననాటికి, యిప్పటికీ మనష్యులలో మార్పు రాకపోలేదు. ఈ

కొద్దిమార్పునైనా చూడగలుగుతున్నందుకు నాకెంతో గర్వంగా వుంది. చూడు దాసప్పా! నేను శాస్త్రిగారిని పిలిపించి నీ విషయం వివరంగా మాట్లాడి, వారిని యెలాగయినా వప్పిస్తాను. మీ ఆదర్శ వివాహాన్ని నా యింటిలో, నా సమక్షంలో జరిపిస్తాను, నువ్వేం ఆందోళన చెందవలసిన అవసరం లేదు. మీ యిద్దరి వివాహం తప్పక జరిగితీరుతుంది. నువ్వెళ్ళిరా. మళ్ళీ నేనే నీకోసం కబురు పెడతాను-సరేనా?'' అనేసి ధైర్యం చెప్పి సాగనంపారు మహీధరంగారు.

గుండెనిండా ఆనందాన్ని నింపుకున్న దాసప్ప నవోత్సాహంతో ఇంటిముఖం పట్టేడు.

---

★ ( ఆకాశవాణి-కడప ద్వారా ప్రసారమైంది)

With best compliments from

Grams : "MTC"

Tel.No.4045583
4043122

**A BAMBINO GROUP VENTURE**

**MARSHALL TRANSPORT COMPANY**

3-7, SAROORNAGAR, HYDERABAD - 035.

(TRANSPORTERS & COMMISSION AGENTS)

AUTHORISED TRANSPORTERS FOR

**BAMBINO VERMICELLI & GHANTA CIGARS**